సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



టన్ను చీనీ రూ.16 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు పలికాయి. మార్కెట్‌కు 692 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



డిగ్రీలో 'ఆనర్స్'
డిగ్రీలోనూ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. నాలుగేళ్ల వ్యవధి ఉన్న ఆనర్స్ డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. 8లో

గరిష్టం/కనిష్టం
36.4°/21.6°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగినా... ఉక్కపోత నుంచి ఉపశమనం లభించలేదు. అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

కిలో టమాట @ రూ.50



బత్తలపల్లి: టమాట ధర దిగొస్తోంది. గత నెల 20 నుంచి కనీవిని ఎరుగని రీతిలో గరిష్ట ధరలతో సామాన్యులను బెంబేలెత్తించిన టమాట ధర గురువారం బాగా తగ్గింది. మొన్నటి దాకా కేజీ రూ.160 దాకా పలికిన ధరలు ప్రస్తుతం రూ.50కి దిగిరావడంతో సామాన్యులకు కష్టాలు తప్పాయి. అనంతపురంతో పాటు అన్నమయ్య జిల్లాలోని టమాట మార్కెట్లలో ధరలు తగ్గుండటంతో టమాట రైతుల్లో ఆందోళన మొదలైంది. ధరలు తగ్గుతున్నా మార్కెట్ల నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు మాత్రం కొనసాగుతున్నాయి. ఇక్కడ నుంచి ఢిల్లీ, ఛత్తీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌కు టమాటలు ఎగుమతి అవుతున్నాయి.

తిరుపతి- సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈనెల 12,13 తేదీల్లో తిరుపతి- సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ గురువారం ప్రకటనలో తెలిపారు. 12న సికింద్రాబాద్ జంక్షన్ నుంచి (07489) రాత్రి 10.05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30కు తిరుపతికి చేరుతుందన్నారు. తిరుపతి జంక్షన్ నుంచి 13వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజాము 4.50 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుందని పేర్కొన్నారు. కాచిగూడ, ఉందానగర్, షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, గద్వాల, రాయచూరు, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా రైలు ప్రయాణిస్తుందని వివరించారు.

నసనకోట ఆలయంలో దుకాణాల వేలం

- ప్రభుత్వానికి రూ.44.37 లక్షలు ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో దుకాణాలు, వాహనాల పార్కింగ్, ఐస్‌క్రీం అమ్మకాలపై గురువారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఇందులో భాగంగానే ప్రభుత్వానికి రూ.44.37 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కురుబ ముత్యాలప్ప మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం ఈ ఆలయం పరిటాల కుటుంబం కంబంధ హస్తాల్లో ఉండేదన్నారు. అయితే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో ప్రస్తుత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకెళ్లారన్నారు. దీంతో ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముత్యాలు, రామలింగారెడ్డి, జేష్ఠ్య రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

- సర్పంచుకు 7, వార్డు మెంబర్లకు 85 నామినేషన్ల దాఖలు

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా 25 మండలాల పరిధిలోని 29 గ్రామ పంచాయతీల్లోని ఒక సర్పంచు, 28 వార్డు మెంబర్ల స్థానాలకు ఈనెల 19న ఉప ఎన్నికలు జరగనున్నాయి. గురువారంతో నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసింది. హిందూపురం మండలం చలివెందుల సర్పంచ్ స్థానానికి 7 నామినేషన్లు , 5 వార్డులకు సింగిల్ నామినేషన్, తక్కిన 23 వార్డులకు 80 నామినేషన్లు దాఖలైనట్లు డీపీఓ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. 11వ తేదీ ఉదయం 10 గంటల అనంతరం నామినేషన్ల పరిశీలన జరుగుతుందన్నారు.13న అప్పీళ్లను పరిష్కరించడం, 14న నామినేషన్ల ఉపసంహరణ, సాయంత్రం 3 గంటల తరువాత పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామన్నారు. 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అవసరమైన చోట పోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల తరువాత ఓట్ల లెక్కింపు తరువాత ఫలితాల వెల్లడిస్తామన్నారు. రీ పోలింగ్ అవసరమైతే 20న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకూ నిర్వహిస్తామని తెలిపారు.

అభివృద్ధికి ప్రధానమైన మౌలిక వసతుల కల్పనలో ఉమ్మడి అనంత జిల్లా ముందువరసలో ఉంటోంది. పెద్ద పెద్ద నగరాలను అనుసంధానించే జాతీయ రహదారుల మంజూరులోనూ, నిర్మాణంలోనూ దూసుకుపోతోంది. ఉమ్మడి జిల్లా ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నింటా ప్రాధాన్యత ఇస్తూ ప్రాజెక్టులను మంజూరు చేస్తున్నాయి. మూడురోజుల క్రితం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికారులతో నిర్వహించిన సమీక్షలో భాగంగా వెల్లడించిన నివేదికలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

ప్రగతి బాట



- రోడ్డు ప్రాజెక్టుల మంజూరులో ఉమ్మడి అనంతపురం జిల్లా ముందంజ
- రాష్ట్రంలోనే అత్యధికంగా జాతీయ రహదారుల నిర్మాణం ఇక్కడే
- 13 ప్రాజెక్టుల నిర్మాణంతో రెండో స్థానంలో అనంతపురం
- శ్రీ సత్యసాయి జిల్లాలో ఇప్పటికే 696 హెక్టార్ల భూ సేకరణ
- మూడేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయని అంచనా

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆంధ్రప్రదేశ్‌లో 167 జాతీయ ప్రాజెక్టులు నిర్మాణమవుతున్నాయి. వీటిల్లో అత్యధికంగా 18 ప్రాజెక్టుల పనులు శ్రీ సత్యసాయి జిల్లాలో సాగుతున్నాయి. రూ.1,300 కోట్లకు పైగా వ్యయం చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో 13 రోడ్డు ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. రహదారుల నిర్మాణానికి 'అనంత'లో 616 హెక్టార్లు, శ్రీ సత్యసాయి జిల్లాలో 1,564 హెక్టార్లు భూమిని సేకరిస్తున్నారు.

'శ్రీ సత్యసాయి' దూకుడు

రహదారుల నిర్మాణంలో శ్రీసత్యసాయి జిల్లా దూసుకెళుతోంది. ఇప్పటికే టోల్‌గేట్‌ల ద్వారా రికార్డు స్థాయిలో వసూలు చేస్తున్న జిల్లా.. ఇప్పుడు అత్యధిక రోడ్డు ప్రాజెక్టులు నిర్మాణం జరుపుకుంటున్న ప్రాంతంగా పేరు గడిస్తోంది. భూ సేకరణలోనూ రెండో స్థానంలో ఉండడం గమనార్హం. ఇప్పటికే మల్బరీ సాగు, ఎంఎస్ఎంఈల ఏర్పాటులో రికార్డు స్థాయి అభివృద్ధిని 'శ్రీ సత్యసాయి' నమోదు చేసుకున్న విషయం తెలిసిందే.

50 శాతానికి పైగా భూ సేకరణ

శ్రీ సత్యసాయి జిల్లాలో 1,328 హెక్టార్ల ప్రైవేటు భూమి, 236 హెక్టార్ల ప్రభుత్వ భూమి సేకరించాల్సి ఉంది. ఇందులో ఇప్పటికే 632 హెక్టార్లు సేకరించారు. మరో 696 హెక్టార్లు సేకరించాల్సి ఉందని జాతీయ రహదారుల అధికారులు పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో 542 హెక్టార్ల ప్రైవేటు భూమి కావాల్సి ఉండగా 347 హెక్టార్లను సేకరించారు. మరో 195 ఎకరాలు మాత్రమే సేకరించాలి. రెండు జిల్లాల్లోనూ ఈ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది.

రాయలసీమ జిల్లాల్లో జాతీయ రహదారుల ప్రాజెక్టులు ఇలా..

జిల్లా	జాతీయ రోడ్డు ప్రాజెక్టులు	మొత్తం భూమి (హెక్టార్లలో)
అనంతపురం	13	616
అన్నమయ్య	07	639
చిత్తూరు	12	1,827
కర్నూలు	05	108
నంద్యాల	05	676
ప్రకాశం	09	1,374
తిరుపతి	08	820
శ్రీ సత్యసాయి	18	1,564

మూడేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి

మూడేళ్లలో అన్ని రోడ్డు ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

వేగంగా భూసేకరణ



జాతీయ రహదారులకు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల సేకరణ ముమ్మరం చేశాం. ఇప్పటికే కొన్నిచోట్ల పనులు జరుగుతున్నాయి. జాతీయ రహదారు విభాగం అధికారులతో సమన్వయంతో ముందుకెళుతున్నాం.
– కేతన్‌గార్గ్
జాయింట్ కలెక్టర్, అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ రూ. 2 వేల కోట్ల వ్యయం చేస్తున్నారు. బెంగళూరు–హైదరాబాద్, బెంగుళూరు–విజయవాడ, హిందూపురం, పుట్టపర్తి వంటి ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీతో రోడ్డు ప్రాజెక్టులు చేపడుతున్నారు. కొత్తగా నిర్మించే రోడ్లతో మరో నాలుగైదు టోల్‌గేట్‌లు కూడా వచ్చే అవకాశం ఉందని ఎన్‌హెచ్‌ఏఐ అధికార వర్గాలు చెబుతున్నాయి.

నేడు కదిరి నియోజకవర్గస్థాయి సమావేశం

పుట్టపర్తి అర్బన్: కదిరి నియోజకవర్గ స్థాయి సమావేశం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటలకు జరగనున్న సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, నియోజక వర్గ , మండలస్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్, డీఎల్‌డీఓ, రెవెన్యూ డివిజన్ అధికారులు పక్కా సమాచారంతో రావాలన్నారు.

నేడు వైఎస్సార్ సున్నా వడ్డీ జమ



పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం సున్నా వడ్డీ జమ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 26న జమ చేయాల్సి ఉండగా అనివార్య కారణాలతో కార్యక్రమం వాయిదా పడిన విషయం విదితమే. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేయనున్నారు. జిల్లాలోని 32 మండలాలు, 6 అర్బన్ ప్రాంతాల్లోని 35,963 గ్రూపులకు రూ.52.38 కోట్లు జమ చేయనున్నారు. ఇందులో సుమారు 3,91,830 మంది అర్హులు ఉన్నట్లు పీడీ చెప్పారు.

17 వరకూ గడువు పొడిగింపు

లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 17వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఎం.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

- పక్కాగా ఏర్పాట్లు చేయండి
- అధికారులతో కలెక్టర్ అరుణ్‌బాబు



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రంలో జరగనున్న 77వ పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో స్వాతంత్య్ర దినోత్సవ ముందస్తు ఏర్పాట్లపై అడిషనల్ ఎస్పీ విష్ణు, డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆగస్టు 15న స్థానిక శిరసాని హిల్స్ పోలీస్ పరేడ్ గ్రౌండులో జరిగే వేడుకలు విజయవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సాధించిన ప్రగతి దశ దిశలా వ్యాపించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పరేడ్ గ్రౌండ్ మైదానంలో అన్ని ఏర్పాట్లు చేయాలని, కట్టుదిట్టంగా పోలీస్ బందోబస్తును కూడా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మనూరు జయరాం జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. వేదిక, సీటింగ్, వీఐపీలకు ప్రత్యేక వేదిక, శానిటేషన్, తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. వచ్చిన వారికి స్నాక్స్ ఏర్పాటు చేయాలని జిల్లా పౌరసరఫరాలశాఖను ఆదేశించారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వ పథకాల ప్రదర్శనను ఏర్పాటు చేయాలన్నారు. జగనన్న విద్యాకానుక, అమ్మఒడి, డిజిటల్ తరగతులు, ఫ్యామిలీ ఫిజీషియన్, వైఎస్సార్ కంటి వెలుగు, ఆరోగ్యశ్రీ తదితర శకటాలు ప్రదర్శించేలా చూడాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో గిరిజన పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి శాఖా ప్రగతి నివేదికలను జిల్లా ప్రణాళిక అధికారికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, నోడలాఫీసర్ శివారెడ్డి, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతోనే నులిపురుగుల నివారణ

ప్రశాంతి నిలయం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోనే నులిపురుగులను నివారించవచ్చని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని కలెక్టర్ అరుణ్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు రోజూ ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. అపరిశుభ్రమైన ఆహారపు అలవాట్లు, అపరిశుభ్ర వాతావరణం మూలంగానే నులిపురుగులు ఏర్పడతాయన్నారు. విద్యార్థుల్లో నులిపురుగులను నివారించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉచితంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి, జిల్లా విద్యాధికారి మీనాక్షి, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, ఆర్డీఓ భాగ్యరేఖ, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇకపై డిజిటల్ విధానంలోనే చెల్లింపులు

- పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి



పన్ను చెల్లింపునకు డిజిటల్ విధానాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ సూర్యకుమారి

చిలమత్తూరు: గ్రామ సచివాలయాల్లో పన్ను చెల్లింపులన్నీ డిజిటల్ విధానంలోనే అమలు కానున్నట్లు పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి అన్నారు. గురువారం మండలంలోని 44 నంబరు జాతీయ రహదారి కోడూరు మర్రోతోపులో ఉన్న గ్రామ సచివాలయం వద్ద డిజిటల్ పన్ను చెల్లింపు విధానాన్ని సూర్యకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు చెందిన డిజిటల్ మిషన్‌ను అందజేశారు. ఆమె మాట్లాడుతూ డిజిటల్ విధానంలో చెల్లింపులను స్వీకరించడం ద్వారా మరింత పారదర్శకంగా పంచాయతీలకు నిధులు సమకూరుతాయన్నారు. అధికారులు, ఉద్యోగులు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆమె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు.

రైతులకు పంపు సెట్ల పంపిణీ..

పుట్టపర్తి అర్బన్: జలకళ పథకం కింద బోర్లు వేసుకొని విద్యుత్ సరఫరా చేసుకున్న రైతులకు పంపు సెట్లు అందజేసే కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. పుట్టపర్తి మండలం మామిళ్లకుంట క్రాస్‌లోని సెరికల్చర్ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి, కలెక్టర్ అరుణ్‌బాబు, డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పీవీఆర్‌ఎంరెడ్డి, వాటర్‌షెడ్ డైరెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, సాగర్‌కుమార్‌రెడ్డి తదితరులు 36 మంది రైతులకు పంప్ సెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంప్‌సెట్లు అమర్చుకున్న రైతులు వరి నాటకుండా ఉద్యాన పంటలు సాగు చేయడంతో పాటు టమాట, మిరప, ఆలుగడ్డ, ఉల్లిగడ్డ తదితర పంటలను సాగు చేసి లాభాలు ఆర్జించాలని సూచించారు.

13న అర్చక సమాఖ్య సర్వసభ్య సమావేశం


ప్రశాంతి నిలయం: ఏపీ అర్చక సమాఖ్య జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 13న పుట్టపర్తిలోని ఆర్.వీ.జే కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు ఆ సమాఖ్య సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రేయబాబు, పేదింటి రాంబాబు, కోటపాడు శ్రీనివాస్ హాజరవుతారని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం నియామకం, అర్చకుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్చకులు హాజరుకావాలని కోరారు.



వాయిద్య కచేరి నిర్వహిస్తున్న హర్యానా,చండీఘర్ భక్తులు

అలరించిన వాయిద్య కచేరీ

ప్రశాంతి నిలయం: హర్యానా చండీఘడ్ సత్యసాయి భక్తుల సంగీత వాయిద్య కచేరీ భక్తులను అలరించింది. పర్తియాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం సత్యసాయి సన్నిధిలో ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హర్యానా, చండీఘడ్ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో నాథ్ జానపద వాయిద్య కచేరీ నిర్వహించారు. అనంతరం కచేరీలో పాల్గొన్న భక్తులకు నూతన వస్త్రాలు, సత్యసాయి జ్ఞాపికను సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే. రత్నాకర్ రాజు,చక్రవర్తి అందించారు.



తన చాంబర్‌లో ఏర్పాటు చేసుకున్న మంచంపై పడుకుని విధులు నిర్వర్తిస్తున్న సూపరింటెండెంట్ రవికుమార్

ఏమి హాయిలే ఇలా..

- కార్యాలయంలోనే సేదదీరుతున్న సెబ్ సూపరింటెండెంట్
- చాంబర్‌లోనే మంచం వేసుకున్న వైనం
- పడుకునే సిబ్బందికి ఆదేశాలు

సాక్షి, పుట్టపర్తి: కార్యాలయంలో ఉన్నప్పుడు నిద్ర మత్తు వస్తే ఎవరైనా సరే వెంటనే ముఖం కడుక్కుంటారు. అప్పటికీ సాధ్యం కాకపోతే సెలవు పెట్టి ఇంటికి వెళ్లిపోతారు. కానీ 'సెబ్' సూపరింటెండెంట్ రవికుమార్ మాత్రం ఇందుకు భిన్నం. ఆయన కార్యాలయాన్నే విడిది కేంద్రంగా మార్చుకున్నారు. తన చాంబర్‌లో మంచం వేసుకుని ఎంచక్కా సేద తీరుతున్నారు. అత్తగారింట్లో కొత్త అల్లుడిలా మంచంపైనుంచే సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నారు. సూపరింటెండెంట్ తీరుతో సిబ్బంది విసిగిపోయారు. గత నెల 26వ తేదీన విధుల్లో ఉన్న సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ పనివేళల్లో తన చాంబర్‌లో ఏర్పాటు చేసుకున్న మంచంపై పడుకుని సిబ్బందికి ఆదేశాలిచ్చే వీడియో ఒకటి తాజాగా వెలుగు చూసింది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

క్లుప్తంగా

'సజ్జల'తో ఎమ్మెల్సీలు భేటీ



సజ్జల రామకృష్ణారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, పీఆర్టీయూ విష్ణువర్ధన్‌రెడ్డి

రాప్తాడు రూరల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలంటూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ఎమ్మెల్సీలు టి.కల్పలతారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు, పీఆర్టీయూ అనంతపురం జిల్లా ప్రధానకార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి విన్నవించారు. గురువారం విజయవాడలో వారు సజ్జలతో కలసి పలు అంశాలపై చర్చించారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అనుసరిస్తున్న వైఖరి, ఫేషియల్ అటెండెన్స్ యాప్‌లోని సాంకేతిక లోపాల వల్ల టీచర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఉమ్మడి సర్వీసెస్ రూల్స్ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వీటికి సజ్జల సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్సీలు తెలిపారు.

విష ప్రయోగంతో చేపల మృతి



మృతి చెందిన చేపలు

తనకల్లు: మండలంలోని ఒడ్డుమరవపల్లిలో చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయడంతో చేపలు మృతి చెందాయి. బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. గురువారం ఉదయానికి చెరువులోని చేపలన్నీ మృతి చెందడంతో పరిసర గ్రామాల రైతులు, పశువుల కాపరులు భయాందోళనకు గురయ్యారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే చెరువులో విష ద్రావకాన్ని కలిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

డిగ్రీలో 'ఆనర్స్'

- కోర్సు పూర్తి కాగానే ఉద్యోగావకాశం దక్కేలా...
- సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌తో పాటు మల్టీడిసిప్లినరీ కోర్సులు



హిందూపురం టౌన్: సాధారణంగా డిగ్రీ కోర్సులకు ఉద్యోగ అవకాశాలు అంతంత మాత్రమే. వేలాది మంది డిగ్రీ పట్టా చేతపట్టుకుని బయటకు వస్తుండడంతో వారిలో నైపుణ్యమున్న కొద్ది మందికి మాత్రమే ఉద్యోగావకాశాలు దక్కేవి. ఈ నేపథ్యంలో డిగ్రీ చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. నూతన విద్యా విధానం అమలులో భాగంగా డిగ్రీ పూర్తయ్యేలోపు ఉద్యోగం, ఉపాధి అందించే దిశగా విద్యాప్రణాళికను అమలు చేస్తుంది. ఈ విద్యాసంవత్సరం నుంచి యూజీసీ సూచనలతో నాలుగేళ్ల వ్యవధి ఉన్న ఆనర్స్ డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది.

ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు..

డిగ్రీ ఆనర్స్, ఆనర్స్ విత్ రీసెర్చ్ డిగ్రీ కోర్సులను ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రారంభమైంది. జిల్లాలోని హిందూపురం, పెనుకొండ, మడకశిర, ధర్మవరం, కదిరి, బుక్కపట్నంలో మొత్తం 6 ప్రభుత్వ మహిళా, పురుషుల డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఉన్నత విద్యామండలి మార్గదర్శకాల మేరకు వసతులు ఉన్న కళాశాలల్లో వాటికి అనుగుణంగా నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టారు. తద్వారా జిల్లాలో దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు ఈ కోర్సులు ఉపయుక్తం కానున్నాయి.

విద్యార్థులకు అవగాహన సదస్సులు..

నూతనంగా ప్రవేశపెట్టిన ఆనర్స్ డిగ్రీ విధానంపై పెద్ద ఎత్తున సదస్సులు నిర్వహించి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆనర్స్ కోర్సుల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కోర్సు పూర్తి చేస్తే దేశంలో ఎక్కడైనా ఉన్నత విద్యను అభ్యసించవచ్చని, విదేశాల్లో సైతం ఉపాధి అవకాశాలు సులువుగా దక్కుతాయని చెబుతున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ పూర్తి చేస్తే పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో రెండో ఏడాదిలో నేరుగా ప్రవేశం పొందే అవకాశం ఉంటుంది. మూడేళ్ల తర్వాత సాధారణ డిగ్రీతో వైదొలిగే అవకాశమూ ఉంటుంది.

ఆనర్స్ డిగ్రీతో ఉద్యోగం గ్యారెంటీ..

విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసి కళాశాలల నుంచి కొలువు దక్కేలా ప్రత్యేకంగా ఆనర్స్ కోర్సులకు రూపకల్పన చేశారు. ఐటీ, పారిశ్రామిక సంస్థలు, ఇతర డిమాండ్ ఉన్న రంగాల్లో మానవ వనరుల అవసరాలకు అనుగుణంగా నూతన సిలబస్‌ను ప్రవేశపెట్టారు. సింగల్ మేజర్ సబ్జెక్ట్‌తో పాటు మల్టీడిసిప్లినరీ కోర్సులు, నైపుణ్యాభివృద్ధి అంశాలను చేర్చారు. ఇందు కోసం తప్పనిసరిగా 8 నెలల ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంది. ముఖ్యంగా ఆనర్స్ డిగ్రీ పూర్తి చేస్తే కొలువులు దక్కేలా ప్రత్యేకంగా సిలబస్‌ను రూపకల్పన చేశారు.

కొత్త కోర్సుల వివరాలు ఇలా..

హిందూపురంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు 9 సింగల్ మేజర్ కోర్సులు, కదిరిలో ప్రభుత్వ కళాశాలకు 11, పెనుకొండ కళాశాలకు 5, మడకశిరలో కళాశాలకు 5, ధర్మవరంలో కళాశాలకు 4, బుక్కపట్నంలో కళాశాలకు 3 కోర్సులను కేటాయించారు.

బీఏ ఆనర్స్ : పొలిటికల్ సైన్సు, స్పెషల్ ఉర్దూ, హిస్టరీ, స్పెషల్ తెలుగు, ఎకనామిక్స్‌లు ఉన్నాయి. హిస్టరీ తదితర సబ్జెక్టులు మైనర్ సబ్జెక్టులుగా ఉన్నాయి.

బీకాం ఆనర్స్ : బీకాం జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్ ఉన్నాయి. ఎకనామిక్స్ మైనర్ సబ్జెక్టుగా ఉంది.

బీఎస్సీ ఆనర్స్ : కంప్యూటర్ సైన్స్, మాథమెటిక్స్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, సెరికల్చర్ ఉన్నాయి. మైనర్ సబ్జెక్టులలోనూ కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ ఉన్నాయి.

విద్యార్థులకు ఉపయుక్తం



విద్యార్థుల భవిత కోసం ప్రభుత్వం గొప్ప ఆలోచన చేసింది. డిగ్రీ చదువు ద్వారా ఉద్యోగం గ్యారెంటీ అనే రీతిలో ఆనర్స్ కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. సిలబస్‌లో సమూల మార్పులు చేశారు. నాలుగేళ్ల యూజీ కోర్సు పూర్తి చేస్తే దేశంలో ఎక్కడైనా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నాలుగేళ్లు చదివితే డిగ్రీతో పాటు పీజీ మొదటి సంవత్సరం చేసినట్లు సర్టిఫికెట్ అందిస్తారు.

– డాక్టర్ ప్రగతి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హిందూపురం

చరిత్రలో నిలిచి పోయేలా
పంద్రాగస్టు వేడుక

- పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి

పుట్టపర్తి అర్బన్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ నెల 15న జరిగే స్వాతంత్య్ర దినోత్సవాన్ని చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి సూచించారు. గురువారం పుట్టపర్తి మండలం పెడపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. పాఠశాల ఎదుట జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నా భూమి–నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. చేతిలో మట్టి తీసుకోగా అధికారులు, విద్యార్థులు చేతులు చాచి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వివిధ రకాల పండ్ల మొక్కలు నాటి నీళ్లు పోశారు. పెడపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు ఎగువవీధి చితంబరరెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అతని కుమారుడు ప్రస్తుత ఎంపీపీ ఏవీ రమణారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది వారం రోజుల పాటు స్వాతంత్య్ర దినోత్సవాన్ని వివిధ కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్య ఎంతో ప్రాముఖ్యమైందని, ఇది తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా పాఠశాలలను రూపుదిద్దుతున్నారన్నారు. మంచిగా చదువుకొని పాఠశాలలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 75 మొక్కలను తప్పని సరిగా నాటాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శివప్రసాద్, సబ్ కలెక్టర్ కార్తిక్, ఆర్డీఓ భాగ్యరేఖ, జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, నోడలాఫీసర్ శివారెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్, ఎంపీడీఓ అశోక్ కుమార్‌రెడ్డి, హెచ్ ఎం రామచంద్రారెడ్డి, సర్పంచ్ మంగ్లీబాయి, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సరస్వతీబాయి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్‌నాయక్, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనుల పరిశీలన..

ధర్మవరం రూరల్: మండలంలోని బుడ్డారెడ్డిపల్లి, నేలకోట, ఏలుకుంట్ల గ్రామాల్లో వాటర్‌షెడ్ పథకం కింద చేపట్టిన పనులను గురువారం సాయంత్రం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వెంట వాటర్‌షెడ్ డైరెక్టర్ వెంకటరెడ్డి, జాయింట్ కమిషర్లు శివప్రసాద్, శశిధర్‌రెడ్డి, అసిస్టెంట్ కమినర్ సాగర్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి, డ్వామా పీడీ రామాంజినేయులు, ఏపీడీ సుధాకర్‌రెడ్డి, ఆర్డీఓ తిప్పేనాయక్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యోగేశ్వరీదేవి, ఎంపీడీఓ సౌజన్య కుమారి, వాటర్‌షెడ్ అధికారులు రవీంద్రారెడ్డి, భాస్కర్, అశోక్, ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

హిందూపురం అర్బన్: హత్యకేసులో నిందితుడిని పోలీసుల అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ వేణుగోపాల్ వెల్లడించారు. ఈ నెల 7న కొటిపి మార్గంలో ప్రధాన రహదారి పక్కనే ప్లాట్లలో ఆటో డ్రైవర్ డి.బాషా హత్యకు గురైన విషయం తెలిసిందే. ఘటనపై కేసు నమోదు చేసిన లేపాక్షి ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ పక్కా ఆధారాలతో గురువారం మధ్యాహ్నం కొండూరు సబ్ స్టేషన్ వద్ద తచ్చాడుతున్న లేపాక్షి మండలం ఎం.వెంకటాపురానికి చెందిన ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో ఆటో డ్రైవర్‌ను తానే హతమార్చినట్లు అంగీకరించాడు. జులాయిగా తిరుగుతూ జల్సాలకు అలవాటు పడిన ప్రసాద్... పొదుపు సంఘం బ్యాంక్ ఖాతాకు డబ్బు జమా చేసి రావాలంటూ తల్లి ఇచ్చిన డబ్బును తన విలాసాలకు వాడుకున్నాడు. దాదాపు రూ.2 లక్షలు స్వాహా చేసినట్లుగా గుర్తించిన సభ్యులు నిలదీయడంతో ఎలాగైనా డబ్బు బ్యాంక్‌లో జమా చేయాలని భావించి దొంగతనాలకు తెరలేపాడు. ఈ నెల 7న హిందూపురానికి వచ్చిన ప్రసాద్ ఎస్‌బీఐ సర్కిల్‌లో ఆటో అద్దెకు మాట్లాడుకుని కొటిపి మార్గంలో వెళ్లాడు. నిర్మానుష్య ప్రాంతానికి చేరుకోగానే ఆటో నిలిపి డ్రైవర్ బాషాను సమీప ప్లాట్లలోకి లాక్కెళ్లి కళ్లలో కారం చల్లాడు. అనంతరం కొడవలితో నరికాడు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుండగానే బాషాను సమీపంలోని గోతిలోకి తోసి బండరాయి వేశాడు. దీంతో బాషా మృతి చెందాడు. నిందితుడి నేరం అంగీకరించడంతో హత్యకు ఉపయోగించిన కొడవలిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

'ఖాద్రీ' ఆలయ హుండీ కానుకల లెక్కింపు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించినట్లు ఈఓ వీ శ్రీనివాసరెడ్డి, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. 54 రోజులకు గాను హుండీలు లెక్కించగా నగదు రూ.63,79,076 ఆదాయం వచ్చిందన్నారు. గతంలో కంటె ఈసారి ఆదాయం ఎక్కువ వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి నరసింహరాజు, స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

మహిళలకు రక్షణగా ఆపరేషన్ 'మేరీ సహేలి'

గుంతకల్లు: మహిళా ప్రయాణికుల రక్షణ, భద్రత కోసం రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఆపరేషన్ మేరీ సహేలి సత్ఫలితాలను ఇస్తోందని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆపరేషన్ మేరీ సహేలిపై ఓ ప్రకటన విడుదల చేశారు. మహిళలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతి కల్పించాలనే లక్ష్యంతో గత ఏడాది అక్టోబర్ 20న ఆపరేషన్ మేరీ సహేలి కార్యక్రమాన్ని మహిళా ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మహిళా ప్రయాణాలకు వివిధ అంశాలలో ఎలా



ప్రయాణికురాలితో ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్న 'మేరీ సహేలి' టీం సభ్యులు

సాయపడాలో అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. సబ్ ఇన్‌స్పెక్టర్ నాయకత్వంలో ఇద్దరి నుంచి 24 మంది సభ్యులతో కూడిన బృందాలు ఇందులో పాల్గొంటున్నాయి. గుంతకల్లు డివిజన్ పరిధిలోని నాలుగు ప్రధాన రైల్వే స్టేషన్లలో ఈ టీమ్ ఏర్పాటు చేసి ఆయా స్టేషన్ల నుంచి రైళ్లలో మేరీ సహేలి టీమ్‌లు గస్తీ నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ప్రయాణ సమయంలో మహిళా ప్రయాణికులకు రైలు ఎక్కడం, దిగడంపై సాయపడడం, ప్రయాణంలో ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకోవడం, మహిళలకు వారి హక్కులపై చైతన్య పరచడం, అందుబాటులో ఉన్న సహాయక విధానాలు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నప్పుడు వెంటనే స్పందించడంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకూ గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా దాదాపు 1,820 రైళ్లలో గస్తీ నిర్వహించిన బృందం సభ్యులు దాదాపు 322 మంది ప్రయాణికులకు సత్వర సాయం అందించారు. అలాగే 1,116 మంది మహిళా ప్రయాణికుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కారకులైన ఆపరేషన్ మేరీ సహేలి సభ్యులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అభినందించారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

లేపాక్షి: కారు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. లేపాక్షి మండలం ఉప్పరపల్లికి చెందిన వెంకటేష్ (65)కు భార్యతో పాటు ఓ కుమార్తె ఉంది. కర్ణాటక సరిహద్దు నగరిగెర గ్రామంలో నివాసముంటున్న కుమార్తెను చూసొచ్చేందుకు గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెంకటేష్ బయలుదేరాడు. నగరిగెరకు సమీపంలో చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై నుంచి రోడ్డుపై పడ్డాడు. ఘటనతో తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను స్థానికులు వెంటనే గౌరిబిదనూరులోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కర్ణాటక పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని ..

పుట్టపర్తి టౌన్: రైలు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీ నాయక్ తెలిపిన మేరకు... బుక్కపట్నం నివాసి శ్రీరాములు (75)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. జీవనోపాధి కోసం పుట్టపర్తిలో నివాసముంటున్నారు. కుమారులు బుక్కపట్నంలోనే స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో శ్రీరాములు భార్య మృతి చెందింది. అప్పటి నుంచి మతిస్థిమితం లేక పుట్టపర్తి, కొత్తచెరువు ప్రాంతాల్లో సంచరించేవాడు. గురువారం ఉదయం కొత్తచెరువు రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా అనంతపురం వైపు నుంచి వస్తున్న రైలు ఢీకొంది. ఘటనలో ట్రాక్ పక్కన పడి ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుకు రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పాలీసెట్‌లో ఆప్షన్ నమోదు ప్రక్రియ ప్రారంభం

హిందూపురం: పాలీసెట్ – 2023కు ఆప్షన్ నమోదు ప్రక్రియ 11 నుంచి 14వ తేదీ వరకు జరగనున్నట్లు హిందూపురం మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.హరీష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు www. appolycet.nic.in వెబ్‌సైట్‌ను పరిశీలించి ఆప్షన్లు ఇచ్చుకోవచ్చన్నారు. 16వ తేదీ మార్పుచేసుకునే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు వెబ్‌సెట్‌లో లాగిన్ కావడంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా లాగిన్ వివరాలు సెల్‌కు సంక్షిప్త సమాచార రూపంలో అందని విద్యార్థులకు ఆగస్టు 11 నుంచి 14 లోపు హిందూపురం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో వ్యక్తిగతంగా హాజరైతే ఆప్షన్ నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని వివరించారు.

డీసెట్ సెకెండ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

పుట్టపర్తి: బుక్కపట్నంలోని డీఈడీ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి సెకెండ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ పేర్కొన్నారు. ఇంటర్‌లో 40 శాతం మార్కులు సాధించినవారికి వెబ్ ఆప్షన్లను ఇచ్చుకోవడానికి అవకాశం ఇచ్చారన్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల మార్పుకు కూడా అవకాశం ఉందన్నారు. ఈ నెల 11 నుంచి 13 వరకూ కళాశాల సెలెక్షన్ కోసం ఆప్షన్లను ఇచ్చుకోవచ్చని పేర్కొన్నారు. 14 నుంచి 16 వరకూ సీట్ కేటాయింపులు, 17న కేటాయింపు సీట్ల వివరాల ప్రచురణ, 17 నుంచి 20 వరకూ కౌన్సెలింగ్ నిర్వహించి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తామన్నారు. 25 నుంచి విద్యార్థులు కళాశాల తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. డీసెట్ రాసి అర్హత కలిగిన విద్యార్థులందరూ వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలన్నారు.

హిజ్రా దౌర్జన్యంపై ఫిర్యాదు

బ్రహ్మసముద్రం: భిక్షమెత్తుకుంటున్న ఓ హిజ్రా అటుగా వెళుతున్న ప్రయాణికుడి నుంచి రూ.5వేలు లాక్కొని ఉడాయించింది. శెట్టూరు మండలం మాకోడికి గ్రామానికి చెందిన యల్లప్ప అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్యని పిలుచుకుని గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఆస్పత్రికి బయలుదేరాడు. గరుడాపురం వద్దకు చేరుకోగానే హిజ్రాలు అడ్డుకున్నారు. ఆ సమయంలో ఓ హిజ్రాకు యల్లప్ప భార్య రూ.10 ఇచ్చింది. అప్పటికే మరో హిజ్రా చనువుగా యల్లప్ప జేబులో చేయి పెట్టి రూ.5వేలు లాక్కొని అక్కడి నుంచి ఉడాయించింది. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువకుడి బలవన్మరణం



బర్కతుల్లా (ఫైల్)

లేపాక్షి: మండలంలోని తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన బర్కతుల్లా (25) ఆత్మహత్య చేసుకున్నాడు. 2016లో జరిగిన ఓ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉండడంతో అప్పట్లో బర్కతుల్లాపై పోలీసులు రౌడీ షీట్ తెరిచారు. ఓ ప్రమాదంలో కాలు విరిగింది. చికిత్స పొంది నయమైన తర్వాత జులాయిగా తిరగడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో పలు మార్లు తల్లి ఫరీదా నచ్చచెప్పినా వినేవాడు కాదు. బుధవారం మరోసారి తల్లి మందలించడంతో జీవితంపై విరక్తి చెంది అదే రోజు రాత్రి ఇంటికి సమీపంలో ఉన్న చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫరీదా ఫిర్యాదు మేరకు కేసు నమోద చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పెనుకొండ రూరల్: భార్య మృతితో జీవితంపై విరక్తి పెంచుకున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పెనుకొండ మండలం నాగలూరు గ్రామానికి చెందిన బోయ అనిల్ (32), సువర్ణ దంపతులు. వీరికి రెండేళ్ల వయసున్న కుమార్తె ఉంది. పాప పుట్టిన తర్వాత అనారోగ్యంతో సువర్ణ మృతి చెందడంతో అనిల్ మద్యానికి బానిసయ్యాడు. చివరకు జీవితంపై విరక్తి పెంచుకుని బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం ఎంత సేపటికీ ఇంట్లో నుంచి అనిల్ బయటకు రాకపోవడంతో పక్కనే నివాసముంటున్న తాత నారాయణప్ప అక్కడకు చేరుకుని పరిశీలించడంతో ఉరికి విగతజీవిగా వేలాడుతున్న అనిల్ కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అశ్రునయనాలతో కిరణ్ అంత్యక్రియలు



పోలీసు లాంఛనాలతో కిరణ్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం. (చిత్రంలో) కుమారులు యశ్వంత్, మణిదీప్

ఆత్మకూరు/అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్ అంత్యక్రియలు గురువారం ఉదయం ఆయన స్వగ్రామం ఆత్మకూరులో పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. శింగనమల మండలం తరిమెలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న తన భార్య అనితను బస్సు ఎక్కించేందుకు అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నుంచి ద్విచక్ర వాహనంపై బుధవారం ఉదయం బయలుదేరిన కిరణ్... లారీ ఢీకొన్న ఘటనలో మృతి చెందిన విషయం తెలిసిందే. గాయపడిన అనిత బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కిరణ్ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించడంతో గురువారం ఆత్మకూరులో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కిరణ్ మృతదేహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి చందు, ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, కదిరి మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషాతో పాటు రాజకీయ నాయకులు, స్నేహితులు అశ్రునయనాలతో నివాళులర్పించారు. అంతిమ యాత్రలో వందల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. తన కళ్ల ముందే భర్త మల్లోబన్న, కుమారులు రమేష్, కిరణ్ మృతి చెందడంతో తల్లి అంజినమ్మ రోదనకు అంతులేకుండా పోయింది. అంత్యక్రియల్లో పాల్గొన్న కిరణ్ కుమారులు యశ్వంత్ నారాయణ, మణిదీప్‌ను చూస్తూ పలువురు కన్నీరు పెట్టారు.

నివాళులర్పించిన ఎస్పీ

సర్వజనాస్పత్రిలో ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్ మృతదేహానికి ఎస్పీ కె.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఇది ఊహించని దుర్ఘటన అని, కిరణ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్, ఆర్ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్, తదితరులు ఉన్నారు.